RNI No: TELTEL2022/83073


# వేద న్యూస్

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:55 | ఫిబ్రవరి 03, 2026 | వెల: రూ.3-00
దినపత్రిక




## బంగారం, వెండి మళ్లీ డౌన్!

- ప్రభావం చూపిన కేంద్ర బడ్జెట్
- మదుపరులు లాభాల స్వీకరణ కూడా కారణమే..
- తదుపరి పరిణామాలపై చర్చోపచర్చలు
- మధ్యతరగతి వినియోగదారుల్లో కొనుగోళ్లపై ఆసక్తి



2లో

# హస్తం ఫోకస్!

## 'మున్సిపోల్స్'పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

- అన్ని స్థానాలూ క్లీన్‌స్వీప్ చేసేలా ఇప్పటినుంచే కార్యాచరణ
- బీ ఫారాల కోసం అభ్యర్థుల లొల్లి
- గెలుపు గుర్రాలకే గ్రీన్ సిగ్నల్..
- రెబెల్స్ బెడద లేకుండా ముందు నుంచే ప్లాన్
- ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేలా కొత్త స్ట్రాటజీ
- గెలుపు బాధ్యత అంతా మంత్రులదే
- పట్టణ ఓటర్లను ఆకట్టుకునేలా సరికొత్త హామీలు



వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో

'టార్గెట్ మున్సిపోల్స్'.. ఇదీ ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ ముందున్న ఏకైక లక్ష్యం.. సర్పంచ్ ఎన్నికల విజయంతో జోష్ మీదున్న అధికార కాంగ్రెస్, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలపై కన్నేసింది. ఈ ఎన్నికలను కేవలం స్థానిక సమరంగా కాకుండా, తమ ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రాష్ట్ర వ్యాప్తంగా క్లీన్ స్వీప్ లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. రహస్య సర్వేల ఆధారంగా గెలుపు గుర్రాల ఎంపిక.., మంత్రుల పదవులకు ముడిపెడుతూ బాధ్యతల అప్పగింత.., విపక్షాలకు చెక్ పెడుతూనే సొంతగూటి రెబెల్స్‌ను కట్టడి చేయడం వంటి బహుముఖ వ్యూహాలతో కాంగ్రెస్ పార్టీ 'మున్సిపోల్స్' సమరానికి సర్వసన్నద్ధమవుతోంది.



## వెంటాడిన ఒంటరితనం..

### మానసిక ఒత్తిడే కారణం?

- హృదయ విదారకంగా తల్లీబిడ్డల ఆత్మహత్య
- కుటుంబ, ఆస్తి కోణాల్లోనూ కొనసాగుతున్న విచారణ

2లో



ఇప్పుడు రేవంత్ రెడ్డికి సమాచారం ఎలాగొస్తుందో

## కేసీఆర్‌కూ అలాగే వచ్చింది!

- ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం లేదు
- సిట్ నోటీసుల పట్ల రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో

## విచారణ వేగవంతం చేయాలి

- దోషులకు శిక్ష పడాలి
- అధికారులు పిలిస్తే హాజరవుతా
- జాగృతి అధ్యక్షురాలు కవిత

2లో



## తెలంగాణ పాఠ్యాంశాల్లో రావి నారాయణ రెడ్డి చరిత్ర!

- విగ్రహ ఏర్పాటు అంశాలపై త్వరలో ప్రభుత్వ నిర్ణయం
- రాష్ట్రంలో సముచిత గౌరవం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం-2025 ప్రదానం



2

## కానిస్టేబుల్ వీరంగం

### మద్యం మత్తులో నడిరోడ్డుపై అర్ధనగ్నంగా..

- భార్యను చితకబాదిన కిరాతకుడు
- చిన్న పాప ఉన్నా వదలని వైనం
- బాధితురాలు గుడిపేట బెటాలియన్లో సూపరిండెంట్
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



2

వేద న్యూస్
మంగళవారం | ఫిబ్రవరి 03, 2026

## పాఠ్యాంశాల్లో రావి నారాయణ రెడ్డి చరిత్ర!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

- విగ్రహ ఏర్పాటు అంశాలపై ప్రభుత్వ నిర్ణయం
- రాష్ట్రంలో సముచిత గౌరవం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం-2025 ప్రదానం

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన సమరయోధుడు రావి నారాయణ రెడ్డికి తెలంగాణ సమాజంలో సముచిత గౌరవం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రావి నారాయణ రెడ్డి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడం, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలపై మంత్రిమండలిలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం–2025'ను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రావి నారాయణ రెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టి కూడా పేదల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప నాయకుడిగా ఆయనను కొనియాడారు. తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన ప్రజానాయకులను ప్రభావితం చేసిన వ్యక్తిత్వం రావి నారాయణ రెడ్డిదని పేర్కొన్నారు. దేశంలో తొలి ప్రధాని నెహ్రూకన్నా అధిక మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన ఘనత రావి నారాయణ రెడ్డికే దక్కిందని సీఎం గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా తొలి పార్లమెంట్ భవనాన్ని ఆయన చేతుల మీదుగానే ప్రారంభింపజేశారని వివరించారు. 60 ఏళ్ల వయసులోనే రాజకీయ పదవులకు స్వచ్ఛందంగా విరమణ చేసి ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఈ జాతీయ పురస్కారం దక్కడం సముచితమని పేర్కొన్న సీఎం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ఆయన పోషించిన పాత్ర, అనుభవం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్ రెడ్డి, కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## నేడు రేవంత్ రెడ్డికి ఎలాగ వస్తుందో కేసీఆర్‌కూ అలాగే వచ్చింది!

**వేద న్యూస్ హైదరాబాద్ ప్రతినిధి**

- ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం లేదు
- సిట్ నోటీసులకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలా సమాచారం వస్తుందో, నాడు కేసీఆర్ ప్రభుత్వానికీ అలాగే వచ్చేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, సిట్ నోటీసులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయని తెలిపారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే విచారణల పేరిట చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. మేడారం జాతర ఏర్పాట్లలో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దావోస్ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వం చెబుతున్న వాదనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని, మొదట వ్యాపారవేత్తలు, ఆపై సినీ తారల ఫోన్లు అంటూ చెప్పి, ఇప్పుడు ఏమీ లేదని అంటోందని ఆరోపించారు. ఈ విషయంలో తీర్పు చెప్పేది కోర్టులేనని, ఇతరులు కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పట్టపగలు కాల్పులు, దోపిడీలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్, సింగరేణి బొగ్గు కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వ వేస్తున్నందుకే సిట్‌ల పేరిట ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌పై కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కేటీఆర్, ఉపాధి హామీ, ఎరువులు, ఆహార రాయితీ, స్వచ్ఛ భారత్ నిధుల్లో కోతలు పెట్టారని విమర్శించారు. బయోఫార్మా కోసం రూ.10 వేల కోట్లు కేటాయించిన కేంద్రం హైదరాబాద్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఢిల్లీకి పదేపదే వెళ్లిన సీఎం సాధించింది ఏమిటని ప్రశ్నించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ వేగవంతం చేయాలి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

- దోషులకు శిక్ష పడాలి
- అధికారులు పిలిస్తే హాజరవుతా
- జాగృతి అధ్యక్షురాలు కవిత




తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంపై కొనసాగుతున్న సిట్ విచారణను వేగవంతం చేసి, దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ప్రారంభమై రెండేళ్లు పూర్తయ్యిందని గుర్తుచేశారు. విచారణ ఇంతకాలం కొనసాగడం ఏమిటని ప్రశ్నిస్తూ, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. సిట్ విచారణపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ కేసులో అధికారులు పిలిస్తే పూర్తిగా సహకరిస్తానని, విచారణకు హాజరవుతానని కవిత స్పష్టం చేశారు. చట్టాలను గౌరవించడం, అధికారులకు సహకరించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. సిట్ విచారణలో ఏమి జరిగిందన్న విషయాలను కేసీఆర్ తానే వెల్లడిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. విచారణను తప్పుబట్టే విధంగా మాట్లాడటం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. తన ఫోన్‌తో పాటు తన భర్త ఫోన్ కూడా ట్యాప్ చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అయినప్పటికీ, నిజాలు బయటపడాలంటే సిట్ విచారణకు పూర్తిగా సహకరించేందుకు సిద్ధమని, అధికారులు పిలిస్తే తప్పకుండా వెళతానని స్పష్టం చేశారు.

# హస్తం ఫోకస్..!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

### 'మున్సిపోల్స్'పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

- అన్ని స్థానాలు క్లీన్‌స్వీప్ చేసేలా ఇప్పటినుంచే కార్యాచరణ
- బీ ఫారాల కోసం అభ్యర్థుల లొల్లి
- గెలుపు గుర్రాలకే గ్రీన్ సిగ్నల్
- రెబెల్స్ బెడద లేకుండా ముందునుంచే ప్లాన్
- ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేలా కొత్త స్ట్రాటజీ
- గెలుపు బాధ్యత అంతా మంత్రులదే
- పట్టణ ఓటర్లను ఆకట్టుకునేలా సరికొత్త హామీలు



తెలంగాణ రాజకీయ యవనికపై మరో కీలక పోరుకు సమయం ఆసన్నమైంది. సర్పంచ్ ఎన్నికల జోరుమీదున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు తన విజయ పరంపరను స్థానిక సంస్థల్లోనూ కొనసాగించాలని పట్టుదలతో ఉంది. రాబోయే మున్సిపల్ ఎన్నికలను కేవలం సాధారణ ఎన్నికలుగా కాకుండా, ప్రభుత్వ పనితీరుకు ప్రజలు ఇచ్చే రిఫరెండంగా భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా సరికొత్త రాజకీయ వ్యూహానికి తెరలేపారు.

### గెలుపు గుర్రాలకే గ్రీన్ సిగ్నల్!

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే సీఎం తనదైన శైలిలో కసరత్తు పూర్తి చేశారు. రాష్ట్రంలోని ఎన్నికలు జరిగే కార్పొరేషన్లు, ప్రతి మున్సిపాలిటీ, వార్డు స్థాయిలో వేర్వేరు ఏజెన్సీలతో అత్యంత రహస్యంగా అంతర్గత సర్వేలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సర్వేల్లో మెజారిటీ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పట్ల సానుకూలత వ్యక్తమైందని తేలింది. గతంలో పార్టీ కోసం పనిచేసిన వారికే కాకుండా, స్థానికంగా సామాజిక సమీకరణాలు, ఆర్థిక బలం, వ్యక్తిగత ఇమేజ్ ఉన్న వారికే టికెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. సర్వేలో తక్కువ రేటింగ్ వచ్చిన సిట్టింగ్ నేతలను పక్కన పెట్టేందుకు కూడా వెనుకాడబోమని అధిష్టానం సంకేతాలిచ్చింది.

### మంత్రులకు పరీక్షగా మున్సిపోల్స్!

ఈ ఎన్నికల్లో గెలుపు బాధ్యతను రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా మంత్రులకు అప్పగించారు. ఇది కేవలం ఎన్నికల బాధ్యత మాత్రమే కాదు, మంత్రుల పనితీరుకు అగ్నిపరీక్ష వంటిదని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో ఒక్క సీటు కూడా ప్రతిపక్షాలకు పోకూడదని, ఒకవేళ ఫలితాలు తేడా వస్తే దానికి మంత్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో మంత్రివర్గ మార్పులు లేదా పదవుల కొనసాగింపు ఈ మున్సిపల్ ఫలితాలపైనే ఆధారపడి ఉంటుందని రేవంత్ రెడ్డి పరోక్ష హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో మంత్రులు ఇప్పట్నుంచే వార్డు స్థాయి నేతలతో సమావేశమవుతూ గ్రౌండ్ లెవల్‌లో పావులు కదుపుతున్నారు.

### రెబెల్స్ బెడదకు చెక్..

అధికార పార్టీలో సహజంగానే ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఇది రెబెల్స్‌గా మారి గెలుపు అవకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని గుర్తించిన అధిష్టానం, ఒక ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రతి జిల్లాలో వివాదాలను పరిష్కరించడానికి సీనియర్ నేతలతో కమిటీలను వేశారు. టికెట్ దక్కని వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు లేదా కార్పొరేషన్ డైరెక్టర్ల వంటి పదవులను ఎరగా చూపి సర్దుబాటు చేస్తున్నారు. పార్టీ లైన్ దాటి రెబెల్స్‌గా పోటీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైతే పార్టీ నుంచి బహిష్కరిస్తామని గట్టిగా హెచ్చరిస్తున్నారు.

### పట్టణ ఓటర్లను ఆకట్టుకునేలా..

కేవలం గ్రామీణ ప్రాంతాలే కాకుండా, పట్టణాల్లోని మధ్యతరగతి ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ఒక ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందిస్తోంది. మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధుల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన, మరియు అవినీతి రహిత పాలనను ప్రధాన అస్త్రాలుగా మలుచుకోనుంది. గత పదేళ్లలో పట్టణాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ, కాంగ్రెస్ హయాంలో రాబోయే మార్పులను వివరిస్తూ విస్తృత ప్రచారం చేయనున్నారు.

### విపక్షాల్లో వణుకు పుట్టిస్తున్న వ్యూహం

బీఆర్ఎస్, బీజేపీలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ ఒక ప్రత్యేక స్ట్రాటజీని అమలు చేస్తోంది. విపక్షాల్లో బలంగా ఉండి, టికెట్ దక్కని అభ్యర్థులతో కాంగ్రెస్ పెద్దలు ఇప్పటికే రహస్య మంతనాలు సాగిస్తున్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ అడ్డాగా ఉన్న మున్సిపాలిటీల్లోని సెకండ్ లైన్ లీడర్లను టార్గెట్ చేసి, వారిని హస్తం గూటికి చేర్చే ప్రక్రియ ముమ్మరమైంది. తద్వారా ప్రత్యర్థి పార్టీలను ఎన్నికల బరిలోకి దిగకముందే బలహీనపరచాలనేది కాంగ్రెస్ ఎత్తుగడ.

# కానిస్టేబుల్ వీరంగం

**వేద న్యూస్, మంచిర్యాల**

### మద్యం మత్తులో నడిరోడ్డుపై అర్ధనగ్నంగా..

- భార్యను చితకబాదిన కిరాతకుడు
- చిన్నపాప ఉన్నా వదలని వైనం
- బాధితురాలు గుడిపేట బెటాలియన్లో సూపరిండెంట్
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



సమాజంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన ఒక రక్షక భటుడు మద్యం మత్తులో రాక్షసుడిగా మారాడు. కంచే చేను మేసిన చందంగా, కన్నబిడ్డను చేతిలో పట్టుకున్న భార్య అని కూడా చూడకుండా నడిరోడ్డుపై దాడికి దిగి సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించాడు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించడమే కాకుండా, సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

### అర్ధరాత్రి అర్ధనగ్నంగా వీరంగం

మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రవి ప్రసాద్, శుక్రవారం అర్ధరాత్రి మద్యం మత్తులో తూలుతూ తన నివాసం ఉండే రెడ్డి కాలనీ రోడ్డుపైకి వచ్చాడు. కేవలం లోదుస్తులతో, అర్ధనగ్నంగా రోడ్డుపై తిరుగుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగక, అనుమానంతో తన భార్య శిరీషపై గొడవకు దిగాడు. మద్యం మత్తు తలకెక్కడంతో విచక్షణ కోల్పోయి ఆమెను రోడ్డుపైనే చితకబాదాడు. ఈ ఘటనలో అత్యంత హృదయవిదారకమైన విషయం ఏమిటంటే.. రవి ప్రసాద్ దాడి చేస్తున్న సమయంలో శిరీష చేతిలో చిన్నపాప ఉంది. పాప ఏడుస్తున్నా, భార్య ప్రాధేయపడుతున్నా ఆ కీచక కానిస్టేబుల్ కనికరించలేదు. జుట్టు పట్టుకుని లాగుతూ, పిడిగుద్దులు కురిపిస్తూ వీరంగం సృష్టించాడు. ఈ క్రూరత్వాన్ని చూసిన స్థానికులు, అటుగా వెళ్లే వాహనదారులు విస్తుపోయారు.

### శిరీషది పోలీస్ శాఖలోనే ఉన్నతోద్యోగం

**నిందితుడు రవి ప్రసాద్ పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, బాధితురాలు శిరీష కూడా అదే శాఖలో ఉన్నత స్థాయిలో ఉన్నారు. ఆమె గుడిపేట బెటాలియన్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరూ విద్యావంతులు, బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నప్పటికీ.. భర్త కరుడుగట్టిన అనుమానం, మద్యానికి బానిస కావడంతో ఒక పచ్చని సంసారం రోడ్డున పడింది.**

### కేసు నమోదు..

భర్త చేసిన దాడిలో గాయపడిన శిరీష, వెంటనే మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ శాఖకే చెందిన వ్యక్తి కావడంతో పోలీసులు తొలుత కొంత ఇబ్బంది పడినా, ఘటన తీవ్రతను బట్టి రవి ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. నిందితుడిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కానిస్టేబుల్ రవి ప్రసాద్ చేసిన వీరంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పోలీసులే ఇలా ప్రవర్తిస్తే సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడ? అంటూ నెటిజన్లు నిప్పులు చెరుగుతున్నారు. తక్షణమే అతడిని సర్వీస్ నుండి తొలగించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## బంగారం.. వెండి మళ్లీ డౌన్!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఈ ఏడాది ప్రారంభం నుంచే రికార్డు స్థాయికి చేరిన బంగారం, వెండి ధరలు తాజాగా తగ్గుముఖం పట్టాయి. ఒక దశలో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.2 లక్షలు దాటగా, కిలో వెండి ధర రూ.4.20 లక్షల వరకు చేరింది. అయితే గత నాలుగు రోజులుగా ఈ విలువైన లోహాల ధరలు క్రమంగా పడిపోతున్నాయి. కేంద్ర బడ్జెట్ ప్రభావం, మదుపరులు లాభాల స్వీకరణకు దిగడం (ప్రాఫిట్ బుకింగ్) ఈ ధరల పతనానికి ప్రధాన కారణాలుగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా అమెరికా కేంద్ర బ్యాంక్ పరిణామాల నేపథ్యంలో డాలర్ బలపడటం కూడా బంగారం, వెండి ధరలపై ఒత్తిడి పెంచిందని విశ్లేషిస్తున్నారు. తాజా పరిస్థితుల్లో వెండి ధరలు సుమారు 12 శాతం, బంగారం ధరలు దాదాపు 9 శాతం మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) రూ.1,54,090 కాగా, 22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు): రూ.1,38,900 ఉంది. కిలో వెండి రూ.2,59,000 ఉంది. ధరలు తగ్గడంతో మధ్యతరగతి వినియోగదారుల్లో కొనుగోలు ఆసక్తి మళ్లీ పెరుగుతోంది. ధరలు ఇంకా తగ్గుతాయా లేదా మళ్లీ పెరుగుతాయా అన్న దానిపై స్పష్టత లేదని నిపుణులు చెబుతున్నారు. అయితే సమీప భవిష్యత్తులో పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నవారు ఇప్పుడే కొనుగోలు చేయడం అనుకూలమని, దీర్ఘకాలిక పెట్టుబడుల దృష్టితో చూస్తే ఈ తగ్గుదల మంచి అవకాశమని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# వెంటాడిన ఒంటరితనం..

**వేద న్యూస్, హైదరాబాద్**

### మానసిక ఒత్తిడే కారణం
### హృదయ విదారకంగా తల్లీబిడ్డల ఆత్మహత్య

హైదరాబాద్ శివార్లలో చోటుచేసుకున్న తల్లీబిడ్డల ఆత్మహత్య ఘటన వెనుక కారణాలపై పోలీసులు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చర్లపల్లి–ఘట్‌కేసర్ రైల్వే ట్రాక్‌పై ఐటీ ఉద్యోగిని విజయరెడ్డి తన ఇద్దరు పిల్లలు చేతన, విశాల్‌తో కలిసి బలవన్మరణానికి పాల్పడిన ఘటనకు తీవ్ర ఒంటరితనం, మానసిక ఒత్తిడే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉప్పల్ రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన విజయరెడ్డి 2007లో సురేందర్‌రెడ్డితో వివాహం చేసుకున్నారు. భర్త నాలుగేళ్లుగా దుబాయ్‌లో ఉద్యోగం చేస్తుండటంతో, విజయరెడ్డి తల్లితో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తూ ఓ ఐటీ సంస్థలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్నారు. నైట్ షిఫ్ట్ విధులు, పిల్లల చదువు నేపథ్యంలో ఇద్దరు పిల్లలను హాస్టల్‌లో ఉంచాల్సి వచ్చింది. భర్త దూరంగా ఉండటం, పిల్లలు దగ్గర లేకపోవడంతో విజయరెడ్డి గత రెండు వారాలుగా తీవ్ర మానసిక ఒంటరితనానికి లోనైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ సమయంలో ఆమె తన స్నేహితులు, బంధువులతో తన ఆవేదనను పంచుకున్నట్లు సమాచారం. ఒత్తిడి పెరుగుతుండటంతో ఆమె భావోద్వేగంగా కుంగిపోయినట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారు.

### సూసైడ్ నోట్‌లో భావోద్వేగాలు

శనివారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి పిల్లలను తీసుకొచ్చిన విజయరెడ్డి, చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో కారు నిలిపారు. అక్కడ పార్కింగ్ స్లిప్ వెనుక భాగంలో రాసిన సూసైడ్ నోట్‌లో 'నాకు బతకాలని లేదు. నేను లేకపోతే పిల్లలు అనాథలవుతారు. అందుకే నాతో పాటే తీసుకెళ్తున్నా' అని పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆ నోట్‌ను ఆమె వాట్సాప్ స్టేటస్‌గా కూడా పెట్టినట్టు గుర్తించారు.

### ఫోరెన్సిక్ విచారణ కీలకం

ఘటన స్థలంలో ఉన్న కారు నుంచి సూసైడ్ నోట్‌తో పాటు విజయరెడ్డి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి, కాల్ డేటా, చాటింగ్ వివరాలు, ఈమెయిల్స్‌ను పరిశీలిస్తున్నారు. ఆత్మహత్యకు ముందు ఆమె ఎవరితో మాట్లాడింది, ఎలాంటి సందేశాలు అందాయి అన్న అంశాలపై దృష్టి పెట్టారు. ఒంటరితనమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నప్పటికీ, కుటుంబ కలహాలు లేదా ఆస్తి వివాదాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. భర్త, అత్తమామలు, బంధువులను విచారిస్తూ అన్ని కోణాల్లో నిజాలను వెలికితీయాలని అధికారులు భావిస్తున్నారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 03, 2026

# ఆశీర్వదించండి సేవకుడిగా పని చేస్తా

**- 14వ వార్డ్ బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి భూస శిరీష - రాజు**

**వేద న్యూస్, నర్సంపేట :**



నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డ్ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వార్డ్ అభివృద్ధి కోసం సేవకుడిగా పనిచేస్తానని బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి భూస శిరీష - రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రజలు గుర్తుకు వచ్చే నాయకులను నమ్మవద్దని,ప్రజా సమస్యలు తీర్చే వారికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. తనకు డబ్బుల మీద ఆసక్తి లేదని, ప్రజలకు సేవ చేయాలనేదే తన అభిమత మన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవకుడిగా పని చేస్తానని ఉద్ఘాటించారు.

# డబ్బికార్ మల్లేష్ గెలుపునకు కృషి చేద్దాం

**- మాజీ ఎమ్మెల్యే జులకంటి రంగారెడ్డి, యువనేత సిద్ధార్థ పిలుపు**

**వేద న్యూస్, దామరచర్ల:**



మిర్యాలగూడ పట్టణంలోని 29వ వార్డులో మిత్రపక్షాల ఉమ్మడి అభ్యర్థి డబ్బికార్ మల్లేష్‌కు మద్దతుగా సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే జులకంటి రంగారెడ్డి, బీఆర్ఎస్ యువనేత సిద్ధార్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జులకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే సమర్థవంతమైన నాయకుడు డబ్బికార్ మల్లేష్ అని పేర్కొన్నారు. 29వ వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే లక్ష్యంగా తమ పోరాటం సాగుతోందని తెలిపారు. యువనేత సిద్ధార్థ మాట్లాడుతూ.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మిత్రపక్షాల అభ్యర్థి డబ్బికార్ మల్లేష్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రజల ఆశీర్వాదంతో ఈ ఎన్నికల్లో మిత్రపక్షాల అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలంపల్లి పరిధిలో ఉపాధి పనులు ప్రారంభం



**వేద న్యూస్, కారేపల్లి:**

పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను గ్రామ సర్పంచ్ శ్రీమతి హేమలత బాలాజీ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామ అభివృద్ధితో పాటు గ్రామ ప్రజల జీవనోపాధికి ఎంతో దోహద పడుతోందని స్థానికులు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో నిరుద్యోగ సమస్యను తగ్గించడం, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఈ పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గ్రామ అవసరాలను గుర్తించి కాలువల శుభ్రపరిచే పనులు, రోడ్ల మరమ్మతులు, మొక్కలు నాటడం, చెరువుల అభివృద్ధి వంటి పనులను చేపట్టారు. ఈ పనుల ద్వారా గ్రామ సుందరీకరణతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులు కూడా ఏర్పడుతున్నాయని తెలిపారు. పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనుల ప్రారంభం గ్రామ అభివృద్ధికి ఒక కీలక అడుగుగా నిలుస్తోందని, ఈ తరహా ప్రజాహిత కార్యక్రమాలు కొనసాగితే పోలంపల్లి గ్రామం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 'చదువుకో తెలంగాణ' పోస్టర్ ఆవిష్కరణ

**- 'మిషన్ 10వ తరగతి' ప్రారంభించిన ఎమ్మెల్యే**

**- చదువుతోనే సమాజంలో మార్పు: మేడిపల్లి**

**వేద న్యూస్, గంగాధర:**




ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి ప్రోత్సాహక పథకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.2.2 కోట్ల నగదు బహుమతులు విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో తొలి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 లక్షలు, రెండో స్థానానికి రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాల టాపర్లకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున, అలాగే 612 మండలాల టాపర్లకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 2026 మార్చిలో నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ సంస్థలు విద్యారంగానికి సహకరించడం అభినందనీయమని పేర్కొంటూ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ గంగాధర బ్రాంచ్ మేనేజర్ వేములవాడ అజయ్, సిబ్బంది పోరండ్ల భూపతి, డీఓ మంత్రి మహేందర్, గోపాలరావు పేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్య నారాయణ, కాంగ్రెస్ నాయకులు దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, సువీన్ యాదవ్, ఆంజనేయులు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులను విస్మరించిన కేంద్రం..!?

**- కేంద్ర బడ్జెట్లో తీరని అన్యాయం**

**- ఎన్పిఆర్డీ ఇండియా వరంగల్ జిల్లా అధ్యక్షులు అడ్డ రాజు**



**వేద న్యూస్, నల్లబెల్లి :**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన బడ్జెట్ లో దివ్యంగులను విస్మరించటం హేయమైన చర్య అని ఎన్పిఆర్డీ ఇండియా జిల్లా అధ్యక్షుడు అడ్డా రాజు విమర్శించారు. ఈ సందర్బంగా అయన సోమవారం మాట్లాడుతూ 300 రూపాయలతో ఒక పూట భోజనం కూడా రాని పరిస్థితి ఉంటే నెల మొత్తానికి దివ్యాంగుడికి ఇచ్చే పింఛన్ 300 ఏంటని ఇది దివ్యాంగులపై చూపిస్తున్న జాలియా లేక అవహేళన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2012 నుంచి ఇప్పటివరకు అంటే దాదాపు 14 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 'ఇందిరా గాంధీ జాతీయ దివ్యాంగుల పింఛన్ కేవలం 300 వద్దే ఆగిపోయిందని నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్లు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వానికి, దేశంలోని కోట్లాది మంది దివ్యాంగులకు కనీసం 5,000 పింఛన్ ఇచ్చే మనసు లేదని బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమ శాఖకు కేటాయింపులు పెంచామని చెప్పుకోవడం పచ్చి అబద్ధం అన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలు కేవలం పాత వాటికి పేర్లు మార్చినవే తప్ప క్షేత్రస్థాయిలో దివ్యాంగుల బతుకులు మార్చేవి కావన్నారు 'వికసిత్ భారత్' అని గొప్పలు చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం దివ్యాంగులను 'అంధకార భారత్' లోకి నెట్టేస్తున్నారన్నారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారంఅందాల్సిన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం నిధుల కేటాయింపులో కేంద్రం కోత విధించడం దుర్మార్గం అని జనాభాలో గణనీయంగా ఉన్న దివ్యాంగులకు బడ్జెట్‌లో 1% నిధులు కూడా కేటాయించకపోవడం వివక్షకు పరాకాష్టని వెంటనే కేంద్రం తన వాటా పింఛన్‌ను రూ.5000లకు పెంచాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులందరినీ ఏకం చేసి ఢిల్లీ పీఠాన్ని కదిలించేలా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# జనరల్ స్థానాల్లో బీసీలకు బీ ఫారాలు ఇవ్వాలి

**- బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం**

**వేద న్యూస్, దామరచర్ల:**



మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో నామినేషన్ దాఖలు చేసిన బీసీ అభ్యర్థులందరికీ బీ ఫారాలు ఇవ్వాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ.. ఎవరి జనాభా ఎంత ఉందో వారికి అంతా వాటా దక్కాలి.. అనే కాంగ్రెస్ పార్టీ నినాదాన్ని ఆచరణలో చూపాల్సిన అవసరం ఉందన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు బీసీలకు కల్పించకపోతే, పార్టీ పరంగా అయినా తప్పనిసరిగా అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు గతంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్టీ గుర్తులతో జరిగే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీసీలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే కనీసం 56 శాతం బీ ఫారాలు బీసీలకే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ వినతికి స్పందించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికలతో పోలిస్తే మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ శాతం సీట్లు కేటాయించామని తెలిపారు. పార్టీ పరంగా బీసీలకు రాజకీయ అవకాశాలు పెంచేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర నాయకుడు స్కైలాబ్ నాయక్, బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లుతో పాటు బీసీ నాయకులు పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ సేవలు చేరువ చేయడమే లక్ష్యం

**- గాదేపాడులో బ్యాంకింగ్ అవగాహన సదస్సు**



**వేద న్యూస్, కారేపల్లి:**

రైతులు, మహిళలు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని బ్యాంక్ అధికారులు తెలిపారు. గ్రామీణ ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని గాదేపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం బ్యాంకింగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కారేపల్లి బ్రాంచ్ మేనేజర్ రాము, హెడ్ ఆఫీస్‌కు చెందిన మేనేజర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ.. రైతులకు క్రాప్ లోన్లు, పాడి పరిశ్రమకు సంబంధించిన రుణాలు, వీవో గ్రూపు మహిళలకు తక్కువ వడ్డీతో అందిస్తున్న రుణ సదుపాయాలపై అవగాహన కల్పించారు. అలాగే అనుకోని ప్రమాదాల సమయంలో కుటుంబానికి ఆర్థిక భరోసా ఇచ్చే వివిధ బీమా పథకాల ప్రాధాన్యతను వివరించారు. సదస్సులో భాగంగా బ్యాంక్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన కళాకారులు తమ ఆటపాటలు, ప్రదర్శనల ద్వారా పొదుపు అలవాట్లు, బ్యాంకింగ్ పథకాలపై ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, గ్రామస్తుల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకులు అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. బ్యాంక్ అధికారులు నేరుగా గ్రామానికి వచ్చి పథకాలను వివరించడం వల్ల ప్రజలకు ఎంతో లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వీవో గ్రూపు మహిళలు, రైతులు మరియు బ్యాంక్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రబీ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

**- యూరియా పంపిణీపై నిరంతర పర్యవేక్షణ అవసరం**

**- ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు**

**- ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**వేద న్యూస్, ఖమ్మం:**

రబీ సీజన్ ధాన్య సేకరణకు ముందుగానే సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో రబీ ధాన్య సేకరణ, యూరియా పంపిణీ, మునిసిపల్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రబీ దిగుబడి అంచనాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. గత సీజన్‌లో ఎదురైన సమస్యలను విశ్లేషించి, పరిష్కార చర్యలతో కూడిన నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ధాన్య కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు మిల్లర్లకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా పంపిణీ వంద శాతం యాప్ ద్వారా జరుగుతున్నట్లు తెలిపారు. యూరియా నిల్వలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని, కొరత ఏర్పడితే ముందస్తుగా తెలియజేయాలని ఆదేశించారు. మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, కౌంటింగ్ స్టాఫ్ శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సిబ్బంది హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమతి లేని గైర్హాజరుపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు కొనసాగిస్తూ పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ ప్రాధాన్యత పనులు, ధాన్య కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ. పద్మశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 03, 2026

# ఆదిలాబాద్ జిల్లాను విస్మరించిన కేంద్రం

- విమానాశ్రయం, యూనివర్సిటీ ప్రస్తావన ఏది?
- వెనుక బడిన జిల్లాకు ప్రత్యేక నిధులు ఎక్కడ?
- కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ నేత పసుల చంటి విమర్శలు

**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా:**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు. విమానాశ్రయం, యూనివర్సిటీ, ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వే లైన్, హైదరాబాద్–నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్, సీసీఐ పునరుద్ధరణ వంటి కీలక అంశాలు బడ్జెట్‌లో ప్రస్తావనకే రాకపోవడం బాధాకరమన్నారు. బోథ్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంలో ఆదిలాబాద్ జిల్లా ఎంపీ గేడం నగేష్, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. నలుగురు ఎమ్మెల్యేలను ఇచ్చిన ఆదిలాబాద్ జిల్లాకు ఒక యూనివర్సిటీ కూడా రాకపోవడం దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వే లైన్ విషయంలో ఎంపీకి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణకే కాకుండా దక్షిణ భారతదేశానికే అన్యాయం చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఉపాధికి నిధులు తగ్గించారని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించలేదని విమర్శించారు. పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రత్యేక రోడ్డు ప్యాకేజీ ఇవ్వకపోవడం కూడా నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రైతులకు ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధిని రూ.10 వేలకు పెంచుతామని చెప్పి, బడ్జెట్‌లో అమలు చేయకపోవడం హాస్యాస్పదమని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ అంశాలపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ చట్ల ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, ఆత్మా డైరెక్టర్ రహీముద్దీన్, ధన్నూర్ ఉపసర్పంచ్ కారం రవి, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి

- నీటి సంరక్షణపై అవగాహన అవసరం
- ఆర్డబ్ల్యూఎస్ డీఈ మున్ని నాయక్



**వేద న్యూస్, రుద్రూర్:**

వేసవి కాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు అధికారులు 20 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఆర్డబ్ల్యూఎస్ డీఈ మున్ని నాయక్ తెలిపారు. సోమవారం రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో నీటి ఎద్దడి నివారణ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్, మండల అధికారులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించి నీటి వనరులు, నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్ని నాయక్ మాట్లాడుతూ.. నీటిని వృథా చేయకుండా అవసరమైనంత మేరకే వినియోగించుకోవాలని, నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సింగిల్ ఫేజ్ మోటర్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, తద్వారా నీటి పొదుపుతో పాటు విద్యుత్ బిల్లులు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. మంచినీటి సరఫరాలో అవాంతరాలు ఎదురైతే 1916 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. త్రాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను మరింత పటిష్టం చేయాలని, లీకేజీలను వెంటనే సరిచేయాలని, బోర్లు, పంపుల మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అలాగే గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను గుర్తించి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మచ్కూరి రమేష్, ఎంపీవో అరవింద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అజయ్, వార్డు సభ్యులు జెల్లా సాయిలు, జి. మోహన్, మహేష్, పంచాయతీ కార్యదర్శి మోహన్, కారోబార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో టేకు చెట్లు మాయం!

- పచ్చని చెట్లపై గొడ్డలిపెట్టు
- ఆనవాళ్లు లేకుండా చేసే కుట్ర
- హెచ్‌ఎం తీరుపై సర్వత్రా విమర్శలు
- విచారణకు విద్యార్థి సంఘాల డిమాండ్

**వేద న్యూస్, కారేపల్లి:**

విద్యాలయాలు విజ్ఞాన బోధనతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ ఆదర్శంగా నిలవాల్సిన పరిస్థితుల్లో, గేట్ కారేపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఘటన తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పాఠశాల ప్రాంగణంలో ఉన్న విలువైన టేకు చెట్లను నరికివేయడం మండలవ్యాప్తంగా సంచలనంగా మారింది.

**గుట్టుచప్పుడు కాకుండా..**

పాఠశాల ఆవరణలో ఏళ్ల తరబడి పెరిగిన పచ్చని టేకు చెట్లను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నేలమట్టం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ సంస్థల పరిధిలోని చెట్లను నరకాలంటే సంబంధిత శాఖల అనుమతి తప్పనిసరి. అయితే ఈ నిబంధనలను పక్కనపెట్టి పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ చెట్లను నరికివేయించి, ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఆనవాళ్లు చెరిపివేతపై అనుమానాలు**

నరికిన చెట్ల దుంగలు ఎక్కడికి తరలించారన్న అంశంపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. చెట్ల ఆనవాళ్లు కనిపించకుండా చేసేందుకు పాఠశాల యంత్రాంగం ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్న విద్యాశాఖ విధానాలకు ఇది పూర్తిగా విరుద్ధమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**విచారణకు విద్యార్థి సంఘాల డిమాండ్**

ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువైన ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా.. ఐటీడీఏ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరపాలన్నారు. నరికిన టేకు కలప నిల్వలు ఎక్కడున్నాయో వెల్లడించాలని, బాధ్యులైన హెచ్‌ఎం మరియు సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# నేడు షబ్-ఏ-బరాత్



**వేద న్యూస్, రుద్రూర్:**

షబ్–ఏ–బరాత్ ముస్లిం సమాజం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే ముఖ్యమైన పండుగలలో ఒకటి. నేటి రాత్రి దేశవ్యాప్తంగా షబ్–ఏ–బరాత్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం షాబాన్ నెల 15వ రాత్రి ఈ పండుగను నిర్వహిస్తారు. రంజాన్ నెలకు సుమారు 15 రోజుల ముందుగా షబ్–ఏ–బరాత్ వస్తుంది. ఇస్లాంలో షాబాన్ నెలను అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. షబ్–ఏ–బరాత్ రోజున భక్తులు తమ పాపాలు క్షమించబడతాయని విశ్వసిస్తూ రాత్రంతా జాగారం చేస్తారు. మసీదుల్లో ప్రత్యేక నమాజులు ఆచరిస్తూ అల్లాహ్‌ను ఆరాధించి మన్నింపునకు ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఖబర్‌స్తాన్ (శ్మశానవాటిక)లను సందర్శించి పూర్వీకుల సమాధుల వద్ద మగ్ఫిరత్ (మన్నింపు) కోసం దువాలు చేస్తారు. ఈ పండుగ సందర్భంగా శుభాలు, క్షేమం కలగాలని ప్రార్థిస్తూ, రాబోయే పవిత్ర రంజాన్ నెలకు ఆధ్యాత్మికంగా సిద్ధమవుతారు. వీలైనన్ని ఎక్కువ ప్రార్థనలు చేసి దైవ సాన్నిధ్యాన్ని పొందేందుకు భక్తులు ప్రయత్నిస్తారు.

# అభివృద్ధి పథంలో 'గుంపెళ్ల గూడెం'

**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని గుంపెళ్ల గూడెం గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తోంది. సర్పంచ్‌గా ఎన్నికైన అనంతరం కొద్ది కాలంలోనే గ్రామ ప్రజల మౌలిక సమస్యలను గుర్తించి, పరిష్కార దిశగా చర్యలు చేపట్టిన సర్పంచ్ శ్రీమతి గుగులోత్ కృష్ణవేణి గ్రామాభివృద్ధిలో కీలక ముందడుగులు వేశారు. ఎన్నికల అనంతరం తాగునీటి సమస్యకు ప్రాధాన్యతనిస్తూ నిరంతర నీటి సరఫరాకు చర్యలు తీసుకోవడంతో గ్రామస్తులకు ఉపశమనం లభించింది. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి డ్రైనేజీలు, చెత్త నిర్వహణ, పరిసరాల శుభ్రతకు క్రమబద్ధమైన కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. గ్రామ ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టడం వల్ల రవాణా సౌకర్యం మెరుగుపడింది. వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు తగ్గడంతో గ్రామానికి నూతన రూపు దిద్దుకుంటోంది. ప్రజల అవసరాలను కేంద్రంగా పెట్టుకొని పనులు పారదర్శకంగా నిర్వహించడంతో సర్పంచ్‌పై గ్రామస్తుల్లో విశ్వాసం పెరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామాభివృద్ధి సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందని, భర్త వీరబాబు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని సర్పంచ్ కృష్ణవేణి తెలిపారు. భవిష్యత్తులో గుంపెళ్ల గూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

# సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి హాజరైన అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను అధికారికంగా ప్రారంభించారు. కాసిపేట మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ పోటీలు మండల స్థాయిలో ప్రతిభను వెలికితీసి, జిల్లా స్థాయికి ఉత్తమ క్రీడాకారుల ఎంపికకు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం లక్ష్మి, ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, కాసిపేట సర్పంచ్ బదావత్ నీల, దేవాపూర్ సర్పంచ్ రాందాస్, కాసిపేట ఉప సర్పంచ్ రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, మండల విద్యాధికారి వెంకటేశ్వర స్వామి పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సాంబమూర్తి, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు, మండల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సైన్స్ ప్రతిభా పురస్కారాలు

- 'గంగిశెట్టి' ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

**వేద న్యూస్, శాయంపేట:**



జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం శాయంపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయం లో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పదవ తరగతి చదువుతున్న 72 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి పది మంది విద్యార్థులకు శంకర్ నారాయణ డిక్షనరీలను ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, పాఠశాల ప్రిన్సిపాల్ రజని, ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి జి. బిక్షపతి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజని మాట్లాడుతూ, సైన్స్ టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొంది స్తాయని అన్నారు. లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించి బహుమతులు అందిస్తున్న మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. మండల విద్యాధికారి జి. బిక్షపతి మాట్లాడు తూ, చదువే విద్యార్థి భవిష్యత్తుకు పునాది అని, ఈరోజు కష్టపడి చదివినవారే రేపు మంచి స్థాయిలో స్థిరపడతారని తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ఎన్. మిన్ను, యు. స్నిగ్ధ, పి. శ్రీహర్షిత, కే. శివాత్మిక, ఏ. జాన్వి, కే. ప్రహర్షిని, ఎం. శ్రీనిధి, జీ. దీక్ష, ఎస్. ఇందు, పి. చరణ్యలను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడిగా తిరుపతి

**వేద న్యూస్, కాసిపేట:**



మంచిర్యాల జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడిగా కాసిపేట మండలానికి చెందిన బోయినీ తిరుపతి నియమితుల య్యారు. రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల మహేష్ చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బోయినీ తిరు పతి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామాల అభివృద్ధిలో క్రియాశీల పాత్ర పోషిస్తానని చెప్పారు. నియామక కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉప సర్పంచ్‌లు పాల్గొని బోయినీ తిరుపతిని అభినందించారు. ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల మహేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సర్పంచ్‌కు ఘన సన్మానం



**వేద న్యూస్, రుద్రూర్:**

భాకర్ ఫారం గ్రామానికి తొలి సర్పంచ్‌గా భారీ మెజారిటీతో ఎన్నికైన సీనియర జర్నలిస్ట్ కనక మెడల శ్రీనివాస్ రావ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. సీనియర్ జర్నలిస్ట్, పెరిక సంఘం జిల్లా నాయకుడు కన్నె రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాలువా, పూలమాలలతో సర్పంచ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల విశ్వాసంతో సర్పంచ్‌గా ఎన్నికైన శ్రీనివాస్ రావ్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోట్ల గంగారాం, వార్డు సభ్యులు ఆమంద్ వెంకట్, బర్ల గంగాధర్ (చిట్టి), బర్ల శంకర్, మైనార్టీ నాయకులు ఖలీమ్, జమిల్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 03, 2026

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ మండల కేంద్రానికే పరిమితం చేయాలి

**– స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ అజీమ్ డిమాండ్**



**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ఇటీవల మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మండల కేంద్రానికే పరిమితం చేసి నిర్మించాలని స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మహమ్మద్ అజీమ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు చందుర్తి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ.. వేములవాడ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను చందుర్తి మండల కేంద్రంలో నిర్మిస్తే అభివృద్ధిలో వెనుకబడిన మండలానికి న్యాయం చేకూరుతుందని అన్నారు. బోడగుట్ట ప్రాంతంలో సుమారు 54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, 442 సర్వే నెంబర్‌లో పూర్తి స్థాయి సర్వే నిర్వహించి స్కూల్ నిర్మాణానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫిబ్రవరి 6న (శుక్రవారం) ఉదయం 9 గంటలకు చందుర్తి అంబేద్కర్ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ భూముల సర్వే, హద్దుల నిర్ధారణ చేసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చందుర్తి మండలంలోని యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రామ వార్డు సభ్యులు మటకంమల్లేశం, గొల్లపల్లి రేచల్ హరిబాబు, తోట శ్రీనివాస్, మర్రి రమేష్, లింగంపల్లి జమున మదన్, నేరెళ్ల రాజేందర్, అత్తెన పద్మ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్ని సబ్జెక్టులపై సాధన చేయాలి

**– టైమ్ టేబుల్ ప్రకారం చదవాలి – ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**– ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో 10వ తరగతి విద్యార్థులకు అవగాహన తరగతులు**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై క్రమం తప్పకుండా సాధన చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సుందర య్యనగర్ ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో సోమవారం నిర్వహించిన వార్షిక పరీక్షల ప్రేరణ, అవగాహన తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్, పదో తరగతి విద్యార్థి జీవితంలో కీలకమైన దశ అని అన్నారు. ఇప్పటి మార్కులు భవిష్యత్ చదువులకు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరి గా చదువుకు టైమ్ టేబుల్ రూపొందిం చుకుని, దాని ప్రకారం అన్ని సబ్జెక్టులు చదవాలని సూచించారు. గత ప్రశ్నాపత్రాల సాధనతో పాటు రోజుకు 3, 4 గంటల సెల్ఫ్ స్టడీ చేయాలని తెలిపారు. పరీక్షల సమయానికి అనుగుణంగా రైటింగ్ ప్రాక్టీస్ చేయడం కూడా అవసరమని పేర్కొన్నారు. ఇష్టపడి చదివితే ఏ నేపథ్యం నుంచి వచ్చినా విజయం సాధించవచ్చని, ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, ఏఎస్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**– ఫీడర్ కెనాల్ పనులతో రైతుల్లో ఆనందం**

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫీడర్ కెనాల్ పనులను గ్రామ సర్పంచ్ ఎం. రాజు సోమవారం అధికారికంగా ప్రారంభించారు. తిమ్మాయి చెరువు నుంచి రామలింగేశ్వర గుడి ముందు వరకు చేపట్టిన ఈ పనులు గ్రామ అభివృద్ధితో పాటు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా సాగుతున్నాయని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీడర్ కెనాల్ పనులు పూర్తయితే వ్యవసాయ భూముల్లో నీటి నిల్వ పెరిగి భూగర్భ జలాలు మెరుగుపడతాయని అన్నారు. వెంకట్రావుపల్లి గ్రామం మీదుగా వెళ్లే డి-1 కాలువకు ఈ ఫీడర్ కెనాల్‌ను అనుసంధానం చేయడం వల్ల వ్యవసా యాభివృద్ధికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ పనులతో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ ఎం. రాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాకం సుమన్, అంతటి శ్రీకాంత్ గౌడ్, మామిడి సుశీల, మామిడి శ్రీనివాస్, కూనబోయిన దేవయ్యఎల్లవ్వ, కూనబోయిన రఘు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ పుష్పలత, ఫీల్డ్ అసిస్టెంట్ వేణు, నాయకులు కొట్టె వెంకన్న, దయ్యాల రామకృష్ణ, ఎర్రోజు రవితేజతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామసభ రసాభాస

**– బెల్టు షాపులపై నిషేధం..– ఇసుక అక్రమ తరలింపుపై కఠిన నిర్ణయాలు**



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహిం చిన గ్రామసభ రసాబసగా సాగింది. గ్రామా భివృద్ధి, ప్రజా శాంతి భద్రతలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామసభలో బెల్టు షాపులపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని తీర్మానించారు. అలాగే గ్రామ పరిధి నుంచి ఇసుక లేదా మట్టి బయట గ్రామాలకు తరలిం చరాదని స్పష్టం చేశారు. అక్కపల్లి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఎవరు సమాచారం అందించినా వారికి రూ.5వేలు పారితోషికం ఇవ్వాలని నిర్ణయించారు. ఇసుక అక్రమంగా తరలించిన వారిపై రూ.50వేలు జరిమానా విధించనున్నట్లు గ్రామసభలో వెల్లడిం చారు. ఈ గ్రామసభలో సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు, ఉపసర్పంచ్ మందాటి బాబు, పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి పవిత్రతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎలుగుబంటి వేషంలో సర్పంచ్

**– కోతులను తరిమికొట్టేందుకు వినూత్న ఆలోచన**
**– గ్రామస్తులకు తాత్కాలిక ఉపశమనం**

**వేద న్యూస్, గంభీరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామంలో కోతుల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు, ఇళ్లపై కోతుల దాడులు పెరగడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఈ సమస్యను గమనించి న గ్రామ సర్పంచ్ రాజిరెడ్డి వినూత్నంగా స్పందిం చారు. స్వయంగా ఎలుగుబంటి వేషం ధరించి గ్రామ వీధుల్లో తిరుగుతూ కోతులను తరిమికొట్టే ప్రయత్నం చేశారు. ఈ చర్యతో కోతులు భయపడి అడవివైపు పారిపోవడంతో గ్రామానికి తాత్కాలిక ఉపశమనం లభించింది. గత కొంతకాలం గా కోతుల కారణంగా పంటలకు తీవ్ర నష్టం జరుగుతుండటంతో పాటు, పిల్లలు, వృద్ధులు బయటకు రావడానికే భయపడే పరిస్థితి నెలకొన్నది. సర్పంచ్ చూపిన చొరవను గ్రామస్తులు ప్రశంసిస్తూ, కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామ సంక్షేమం కోసం సర్పంచ్ చేసిన ఈ వినూత్న ప్రయత్నం ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

**– జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లాలో శాంతి భద్రతలను కాపాడే ఉద్దేశంతో పోలీస్ యాక్ట్-1861 ప్రకారం ఫిబ్రవరి 1 నుంచి 28వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు లేదా సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగించడాన్ని నిషేధించినట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీస్ యాక్ట్ అమలులో భాగంగా పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సూచించారు.

# సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, శంకరపట్నం:**



శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మానకొండూరు నియోజకవర్గ శాసన సభ్యులు డా. కవ్వంపల్లి సత్య నారాయణ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు యువత లో స్నేహభావం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మండల నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పదేళ్లు పత్తాలేరు..

- పేదవారికి ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- ఇప్పుడొచ్చి దండాలు పెడుతున్నారా?
- గులాబీ నేతలపై మంత్రి పొంగులేటి ఆగ్రహం
- ఏదులాపురంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

పదేళ్ల పాటు ప్రజలను గాలికొదిలేసి.. ఇప్పుడు ఎన్నికలు రాగానే దండాలు పెట్టుకుంటూ వస్తున్న నాయకులను నమ్మాలా? పేదోడికి ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేని వాళ్లు ఓట్లు అడగడానికి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు? అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గులాబీ నేతలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. సోమవారం ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2, 22, 23, 24, 26, 27వ వార్డుల్లో నిర్వహించిన రోడ్‌షోలలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అర్హులైన పేదలకు ఏ సంక్షేమం అందలేదని, ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన ఘనత వారిదేనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇప్పుడు విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

**గాలి మోటార్ల నాయకులకు గల్లీ కష్టాలేం తెలుసు?**

ఫామ్ హౌస్‌లకే పరిమితమై, గాలి మోటార్లలో తిరిగిన నాయకులకు గల్లీల్లో డ్రైనేజీలు పొంగుతుంటే, ఇళ్లు మునుగుతుంటే కనిపించాయా? అని పొంగులేటి నిలదీశారు. రాజీవ్ గృహకల్ప వాసులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని వారు ఇప్పుడు ఎన్నికల కోసం కొత్త నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు ఇచ్చామని, అది కాంగ్రెస్ మార్కు పాలన అని స్పష్టం చేశారు.

**మున్నేరుకు కష్టాలకు శాశ్వత పరిష్కారం**

రూ.690 కోట్లతో నిర్మిస్తున్న మున్నేరు రిటైనింగ్ వాల్ ఏదులాపురానికి రక్షణ కవచంలా మారుతుందని మంత్రి తెలిపారు. జూన్ నాటికి కరకట్ట పనులు పూర్తి చేసి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.308 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఏదులాపురాన్ని రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. అభివృద్ధి కావాలంటే హస్తం గుర్తుకే ఓటేయాలని, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి పొంగులేటి ప్రజలకు పిలుపునిచ్చారు.

# సులేమాన్‌నగర్‌లో పశు వైద్య శిబిరం ఏర్పాటు



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామంలో సోమవారం ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కోరుట్ల పశు వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, పశు వైద్య, పశు సంవర్ధక శాఖ, జిల్లా లయన్స్ క్లబ్ బోధన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ అఫ్రీన్ బేగం-ఖాదర్ ప్రారంభించారు. శిబిరంలో వివిధ వైద్య నిపుణుల సమక్షంలో పశువులకు ఆరోగ్య పరీక్షలు, చర్మ వ్యాధి పరీక్షలు, పేడ పరీక్షలు నిర్వహించారు. గర్భకోశ నిపుణుల పర్యవేక్షణలో అల్ట్రాసౌండ్ స్కానర్ ద్వారా తొలి దశ గర్భ నిర్ధారణను 12 పశువులకు చేశారు. అలాగే నట్టల నివారణ కోసం 19 గేదెలకు, 22 ఆవు దూడలకు, 15 గేదె దూడలకు, 105 గొర్రెలకు, 15 మేకలకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా. ఎం. శ్రీనివాస్, రుద్రూర్ మండల పశు వైద్యాధికారి డా. సంతోష్, వైద్య నిపుణులు డా. గోపాలకృష్ణ, డా. మల్లేష్, డా. అరుణ, జూనియర్ వెటర్నరీ డాక్టర్లు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సాయి రాజ్, గోపాలమిత్ర హనుమండ్లు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫారాల పంపిణీ



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఏదులాపురం మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు పాలేరు మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ కందాళ ఉపేందర్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాతా మధు బీ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యతతో పనిచేయాలని సూచించారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగి, బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# శివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- సమన్వయంతో జాతర నిర్వహించాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు.. ఎస్పీ



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మహా శివరాత్రి జాతరను పకడ్బందీ ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని జాతర కమిటీ చైర్‌పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో వేములవాడలో జరగనున్న జాతర ఏర్పాట్లపై సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం వరకు రోడ్ల మరమ్మతులు, బారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు సిద్ధం చేయాలని ఆర్టీసీకి సూచించారు. ఈ ఏడాది సుమారు 600 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆలయ పరిసరాలు, క్యూ లైన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో మూడు షిఫ్టుల్లో సిబ్బంది ఏర్పాటు చేయాలని, జాతరకు ముందు, తర్వాత మూడు రోజుల పాటు పారిశుధ్య సేవలు అందించాలని ఆదేశించారు. బస్టాండ్‌లు, పార్కింగ్ స్థలాల్లో హెల్ప్‌డెస్క్‌లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. తాగునీరు, అల్పాహారం, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత శాఖలకు సూచించారు. విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఫైర్ సేఫ్టీ చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి, క్యూ లైన్ల వద్ద స్టీల్ గ్లాసుల్లో తాగునీరు అందించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్లు, వలంటీర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

**ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు.. ఎస్పీ**

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రత చర్యలు చేపడతామని చెప్పారు. జాతరకు సంబంధించిన అన్ని పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీఓలు రాధాబాయి, వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

- 14 నుంచి 16 వరకు జాతర నిర్వహణ



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ గంగాధర క్షేత్రంలో జరగనున్న మహాశివరాత్రి జాతర మహోత్సవానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు, ముస్కాన్‌పేట గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్ఫటిక లింగంతో ఏర్పాటు చేసిన గంగాధర క్షేత్రం మండల ప్రజలకు విశేషమైన ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని అన్నారు. ఈ నెల 14 నుంచి 16 వరకు మహాశివరాత్రి జాతర వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, ఇల్లంతకుంట ఉపసర్పంచ్ మూగు నాగరాజు శర్మ తెలిపారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని, వారి కోసం చలవ పందిళ్లు, అన్నప్రసాద వితరణ‌ే అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య యాదవ్, కోయ్యడ భాస్కర్, డాక్టర్ జగన్ మోహన్ రావు, తుంకుంట్ల మోహన్ రెడ్డి, ఈదుల రవీందర్ రెడ్డి, నార్ల రామకృష్ణ, వార్డు సభ్యులు రాకం సుమన్, అంతటి శ్రీకాంత్, కూరబోయిన రఘు, మామిడి శ్రీనివాస్, రాజు, మామిడి హరీష్, ఎర్రోజు సంతు, మచ్చ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల కోసమే

- చట్టపరంగా న్యాయం అందిస్తాం - జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు పలు గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు, వివాదాలు, పోలీసు సంబంధిత ఇబ్బందులను ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని కేసుల విషయంలో ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా అనేక సమస్యలు పరిష్కారమై, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని పేర్కొన్నారు.

# గ్రామాల్లో రహదారుల అనుసంధానమే లక్ష్యం



- సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

అన్ని గ్రామాలను రహదారులతో అనుసంధానం చేసి, వాహనదారులకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు, ముస్కాన్‌పేట సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఇల్లంతకుంట మండలంలోని ముస్కానే‌ఎట-తాళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారిని ఉపాధి హామీ పథకం కింద చదును చేసే పనులను ఆయన ప్రారంభించారు. రెండు గ్రామాల మధ్య ప్రజలకు, రైతులకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా రహదారిని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి రచన వెంకట్రాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎలుక రామస్వామి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# అభ్యంతరాల పరిష్కారంలో నిబంధనలు పాటించాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**వేద న్యూస్, మంచిర్యాల:**



మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్లపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పరిశీలిం చారు. చెన్నూర్ మున్సిపాలిటీలోని 18 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హుల జాబితా రూపొందించి, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ తర్వాత తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 12న రీపోలింగ్ (ఉంటే), 13న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ (ఫోన్: 08736-250501) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమాచారం, ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అమృత్ 2.0 కింద నీటి ట్యాంక్, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు పూర్తి సదుపాయాలు కల్పించాలని, మధ్యాహ్న భోజన మెనూ కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సన్నద్ధం చేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎస్పీ మహేష్ బి. గితే
- గ్రీవెన్స్ డేలో 28 ఫిర్యాదుల స్వీకరణ




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

బాధితుల సమస్యలను వేగంగా పరిష్కరించి చట్టపరంగా న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 28 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు చేస్తూ, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే గ్రీవెన్స్ డే ఉద్దేశమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కార పురోగతిని నిరంతరం సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

# నేడు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం నగరం మమత హాస్పిటల్ సమీపంలోని డా. పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని నేడు సాయంత్రం 5:30 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ రోజున నిర్వహించిన రంగోలి పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం, పులిపాటి టవర్స్‌లో మినీ ఏసీ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్, వాకింగ్ ట్రాక్ ప్రారంభోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల తనయుడు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు తుమ్మల యుగంధర్ హాజరుకానున్నారు. విశిష్ట అతిథులుగా ఖమ్మం నగర మేయర్ పూనుకొల్లు నీరజ, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు పాల్గొననున్నారు. ఆత్మీయ అతిథులుగా ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, ఖమ్మం డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**- రూ.25వేలు జరిమానా విధించిన కోర్టు**

**వేద న్యూస్, మెదక్ జిల్లా:**



పెద్దనాన్నను హత్య చేసిన కేసులో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.25వేలు జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. ఈ కేసు 2021 ఏప్రిల్‌లో వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. నానవత్ కిషన్ తన భార్యతో కలిసి పొలానికి వెళ్లిన సమయంలో, అతని తమ్ముడు రమేష్ కుమారుడు నానవత్ నర్సింహా తన చెల్లికి కిషన్ చేతబడి చేశాడన్న అనుమానంతో కిషన్‌ను హత్య చేయాలనే ఉద్దేశంతో అక్కడికి వచ్చాడు. కిషన్ భార్య మాత్వలిని ఇంటికి పంపిన అనంతరం, నర్సింహా తన వెంట తెచ్చుకున్న కత్తితో కిషన్ కడుపులో పలు మార్లు పొడిచాడు. తీవ్ర గాయాల పాలైన కిషన్‌ను ఆసుపత్రికి తరలించగా, అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై వెల్దుర్తి ఎస్సై మహేందర్ కేసు నమోదు చేశారు. అప్పటి విచారణాధికారి తూప్రాన్ సీఐ స్వామి సాక్ష్యాధారాలు సేకరించగా, ప్రస్తుత విచారణాధికారి తూప్రాన్ సీఐ రంగ కృష్ణ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పూర్తి సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25వేలు జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ సమర్థంగా వాదనలు వినిపించగా, లైసనింగ్ ఆఫీసర్ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, వెల్దుర్తి సీడీఓ ప్రవీణ్ సహకరించారు. శిక్ష పడడంలో కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**వేద న్యూస్, ముస్తాబాద్:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతులు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతోనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాజ్యాం గబద్ధంగా సాగుతున్న విచారణలను అడ్డుకోవాలనే యత్నాలు మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ వంటి చర్యలతో అనేక కుటుంబాల జీవితాల్లో కలకలం సృష్టించినవారు ఇప్పుడు మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలను గడపగడపకు చేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని ఇబ్బంది పెట్టే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, జిల్లా నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ దొంగ అరెస్ట్

**- మూడు ద్విచక్ర వాహనాల స్వాధీనం**

**వేద న్యూస్, మెదక్:**



మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ద్విచక్ర వాహన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ వెల్లడించారు. నర్సిములు అనే వ్యక్తి పని నిమిత్తం మెదక్‌కు వచ్చి ఆటో నగర్‌లోని వన దుర్గ భవాని వైన్స్ షాప్ ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తి బైక్‌ను దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సోమవారం బోధన్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా అనుమానం వచ్చి పట్టుకుని విచారించారు. విచారణలో అతని పేరు కమ్మరి రాములుగా గుర్తించినట్లు తెలిపారు. విచారణలో నిందితుడు పలు ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని, గతంలో కూడా మెదక్, రామాయం పేట పరిసరాల్లో అనేక కేసుల్లో నిందితుడిగా జైలుకు వెళ్లి వచ్చిన పాత నేరస్తుడని పోలీసులు తెలిపారు. అతనిపై మెదక్, రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు ఆరు కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి మొత్తం మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపికకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**





మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు పకడ్బం దీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియ, ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా చిన్నపాటి లోపాలకు కూడా అవకాశం ఇవ్వకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియామావళి పూర్తిగా అమలులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా కౌన్సిలర్లకు, ఎక్స్ ఆఫీషియో సభ్యులకు ముందుగానే పూర్తి సమాచారం అందించాలని, పోలింగ్ నిర్వహణ నుండి లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను సక్రమంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు వరంగల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ వాసుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్‌పై జనసేన గురి

- కౌన్సిలర్లుగా బరిలో నవ యువకులు
- మార్పునకు సంకేతం అంటూ నేతల ధీమా
- పురపోరులో సత్తా చాటేందుకు గాజు గ్లాసు సమాయత్తం

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా చాటి జనసేన జెండాను మున్సిపాలిటీలో ఎగరవేయబోతున్నామని జనసేన నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 11న పురపోరు జరగనున్న నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సమాయత్త మవుతున్నారు. ఈ నేపథ్యంలోనే గాజుగ్లాసు పార్టీ ఎన్నికల బరిలో నిలవబోతున్నది. 13 మంది కౌన్సిలర్లు జనసేన తరఫున బరిలో నిలిచారు. వీరికి తాజాగా జనసేన కరీంనగర్ జిల్లా ఇన్ చార్జి ఆర్ కే సాగర్ పార్టీ బీ ఫామ్‌లు అందజేశారు.

**మార్పునకు అడుగులు**

"మార్పునకు అడుగులు ఒకొక్కొటిగా పడతాయి" అని జనసేన నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ గడ్డ మీద పుట్టిన జనసేన పార్టీ, ఆటు పోట్లని ఎదుర్కొని ఆంధ్ర రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి కీలక పాత్ర పోషిస్తోందని, అదే రీతిన తెలంగాణలోనూ జనసేన క్రియాశీలక పాత్ర పోషిస్తుందని నాయకులు చెబుతున్నారు. జమ్మికుంట మున్సి పల్ పరిధిలోనూ ప్రజలు యువత జనసేన వైపు మొగ్గు చూపే అవకాశాలుంటాయని నేతలు అంటున్నారు. మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, జనసేన నాయకుడు బొమ్మినేని రాకేశ్ నేతృత్వంలో మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి నేతలు పలువురు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ.. జనసేన జిల్లా ఇన్ చార్జి ఆర్ కే సాగర్ నాయకత్వంలో జనసేన పార్టీ బలంగా ఎన్నికల్లో సత్తా చాటేలా తాము సైనికుల్లా పని చేస్తామని చెప్పారు. జమ్మికుంట





మున్సిపల్ ఎన్నికల్లో జనసేన జెండా బలంగా ఎగిరేలా తాము శక్తి వంచన లేకుండా చిత్తశుద్ధితో ప్రయత్నిస్తామని వెల్లడించారు. ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికలలో గాజు గ్లాసు గుర్తుకు ఓటేయాలని, మార్పునకు నాంది పలకాలని, అవినీతి రహిత పాలన జనసేనతో సాధ్యమని ప్రజలను ఓట్లు అభ్యర్థి స్తున్నారు.

# సంక్షేమం పేరుతో బలహీనమవుతున్న భవిష్యత్తు

**వేద న్యూస్ డెస్క్:**

దేశవ్యాప్తంగా రాజకీయాలు, ఎన్నికలు, ప్రభుత్వ విధానాల మధ్య ఒక పదం ఎప్పుడూ చర్చలో ఉంటుంది. "ఉచిత పథకాలు". పేదలకు అండగా నిలవడం, అసమానతలను తగ్గించడం అనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ పథకాలు, నేడు సమాజాన్ని నిజంగా ముందుకు నడిపిస్తున్నాయా? లేక నెమ్మదిగా అలవాటుగా మారి ప్రజలను ఆధారపడే పరిస్థితికి నెట్టుతున్నాయా? అన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది.

సంక్షేమ రాజ్యం అనే భావనలో ఉచిత పథకాలకు ఒక నైతికత ఉంది. ఆకలి, నిరుద్యోగం, విద్యా లోపం వంటి సమస్యలతో బాధపడే వర్గాలకు ప్రభుత్వ సహాయం అవసరం అనేది వాస్తవం. ఆహారం, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక అవసరాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సామాజిక న్యాయానికి కీలకం. ఈ కోణంలో చూస్తే ఉచిత పథకాలు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తూ అనేక కుటుంబాలకు జీవనాధారంగా మారాయి.

అయితే సమస్య అక్కడే మొదలవుతోంది. ఉపశమనం తాత్కాలికంగా ఉండాల్సింది పోయి శాశ్వత అలవాటుగా మారితే ఏమవుతుంది? ప్రభుత్వ సహాయం లేకుండా జీవించలేమనే భావన ప్రజల్లో బలపడితే, వ్యక్తిగత శ్రమ, ఆత్మనిర్భరత, ఉపాధి సృష్టి వంటి అంశాలు వెనక్కి నెట్టబడతాయి. ఉద్యోగం కోసం పోరాడే మనస్తత్వం కంటే, పథకం కోసం ఎదురు చూసే పరిస్థితి పెరుగుతుంది. ఇది సమాజానికి దీర్ఘకాలంలో ప్రమాదకరమైన సంకేతం. ఇంకో ముఖ్యమైన కోణం ప్రభుత్వ ఆర్థిక భారం. ఉచిత పథకాల కోసం భారీగా ఖర్చు చేయడం వల్ల అభివృద్ధి వ్యయాలకు నిధులు తగ్గే ప్రమాదం ఉంది. రహదారులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధన వంటి రంగాల్లో పెట్టుబడులు తగ్గితే, భవిష్యత్తు తరాలకు అవకాశాలు పరిమితం అవుతాయి. ఈ రోజు ఇచ్చే ఉచితం, రేపటి అవకాశాలను హరించకూడదనే సమతుల్యత ప్రభుత్వాలకు అవసరం.

ఉచిత పథకాలు పూర్తిగా తప్పు అనడం కూడా సరికాదు. అవి ఎవరి కోసం, ఎంతకాలం, ఏ లక్ష్యంతో అనే స్పష్టత ఉంటేనే అవి ప్రయోజనకరంగా మారతాయి. ఉచితం అనే పదం కంటే, సాధికారత అనే భావన ముందుండాలి. శిక్షణ, ఉపాధి అవకాశాలు, చిన్న పరిశ్రమలకు మద్దతు, విద్య ద్వారా నైపుణ్యాల పెంపు ఇవి ప్రజలను పథకాలపై ఆధారపడకుండా స్వయంపోషితులుగా మారుస్తాయి.

ఈ నేపథ్యంలో సమాజం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనం సహాయం కోరుతున్నామా, లేక అలవాటుగా మారిపోయామా? ప్రభుత్వాలు ఓట్లు కోసం ఉచితాల పోటీకి దిగితే, ప్రజలు బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఉపశమనంతో పాటు దిశ చూపే విధానాలే దేశాన్ని ముందుకు నడిపిస్తాయి.

మొత్తానికి ఉచిత పథకాలు అవసరమే, కానీ అవే లక్ష్యంగా మారకూడదు. ఉపశమనం నుంచి సాధికారత దిశగా ప్రయాణం జరిగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. లేనిపక్షంలో, ఈ రోజు ఇచ్చే ఉచితం రేపటి భవిష్యత్తుపై భారంగా మారే ప్రమాదం ఉంది. ఆర్థికంగా కూడా ఉచిత పథకాల భారం తక్కువ కాదు. ప్రభుత్వ ఆదాయం పరిమితంగా ఉన్నప్పుడు, భారీ సంక్షేమ వ్యయం అభివృద్ధి వ్యయాలను కుదించేస్తుంది. రహదారులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు తగ్గితే, భవిష్యత్తు తరాలకు అవకాశాలు తగ్గిపోతాయి. ఈ రోజు ఉచితంగా అందిస్తున్న వనరులు, రేపటి తరాలపై అప్పుగా మారే ప్రమాదం ఉంది. సంక్షేమంఅభివృద్ధి మధ్య సమతుల్యత లేకపోతే, ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తప్పదు.

# మన్రేగా పథకానికి పుట్టినిల్లు ఆంధ్రప్రదేశ్ - వైఎస్ షర్మిల

- 20 ఏళ్లు పూర్తి చేసుకున్న ఉపాధి హామీ చట్టం
- బండ్లపల్లిలో శిలాఫలకానికి నివాళులు, యాత్ర ప్రారంభం
- దేశంలో తొలి జాబ్ కార్డు పొందిన పెద్దక్కతో భేటీ

**అమరావతి, వేద న్యూస్:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (మన్రేగా) అమలుకు పుట్టినిల్లు ఆంధ్రప్రదేశ్ అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. మన్రేగా చట్టానికి నేటితో 20 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో ఆమె పర్యటించారు. 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా మన్రేగా పథకాన్ని ప్రారంభించిన సందర్భాన్ని షర్మిల గుర్తుచేశారు. ఆ చారిత్రక ఘట్టానికి గుర్తుగా బండ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆమె సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇదే బండ్లపల్లి గ్రామం నుంచి ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రను షర్మిల ప్రారంభించారు. గ్రామీణ పేదల జీవనాధారంగా నిలిచిన మన్రేగా పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఆమె స్పష్టం చేశారు. అనంతరం దేశంలోనే తొలి జాబ్ కార్డు పొందిన బండ్లపల్లి గ్రామస్థురాలు చీమల పెద్దక్కను షర్మిల కలిసి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా లభించిన పనిదినాలు, వేతనాలు, గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజల జీవితాల్లో మన్రేగా తీసుకొచ్చిన మార్పు అపూర్వమని షర్మిల ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు



# 'మ్యాడ్ 3'కు రంగం సిద్ధం..




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలు అందుకున్న మ్యాడ్, మ్యాడ్ 2 చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ సిరీస్ ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో యువతను విపరీతంగా ఆకట్టుకుంది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగా, ఈ ఫ్రాంచైజీకి గట్టి ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పుడు ఈ సక్సెస్‌ను కొనసాగిస్తూ మూడో భాగాన్ని తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఈసారి మ్యాడ్ 3ను పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త నటీనటులతో రూపొందించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో కొత్త తరం యువ నటులను పరిచయం చేయనున్నారని సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో లిటిల్ హార్ట్స్ ఫేం జేయ్ కృష్ణ, కోర్ట్ ఫేం హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. ఫ్రెష్ ఫేస్‌లతో యంగ్ ఎనర్జీని మరింత పెంచాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో ఉండబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైనట్లు సమాచారం కాగా, త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశం ఉందని టాక్.

# అందమే అసూయ పడేలా.. చిరునవ్వుతో మత్తెక్కిస్తున్న చిట్టి..!

**వేద న్యూస్ డెస్క్:**



జాతిరత్నాలు చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఫరియా అబ్దుల్లా తొలి చిత్రంతోనే ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. చిట్టి పాత్రతో యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించి తనదైన గుర్తింపును కొనసాగిస్తోంది. ప్రస్తుతం సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తూనే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఫరియా షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. మెరూన్ కలర్ చీరకట్టులో చిరునవ్వులతో కనిపిస్తూ అభిమానుల హృదయాలను దోచుకుంటోంది. చేతిలో గులాబీ పువ్వు పట్టుకుని ముసి ముసి నవ్వులతో ఇచ్చిన ఫోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. బ్లూ అండ్ ఆరెంజ్ కాంబినేషన్‌లో ఉన్న ప్లెయిన్ చీరలో కాటుక కళ్లతో మరింత అందంగా కనిపిస్తూ ప్రశంసలు అందుకుంటోంది. సినిమాల పరంగా చూస్తే హీరోయిన్‌గా మాత్రమే కాకుండా స్పెషల్ సాంగ్స్‌తో కూడా ఫరియా మంచి పాపులారిటీ సంపాదించింది. ప్రస్తుతం తిరువీర్ హీరోగా నటిస్తున్న భగవంతుడు చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనుందన్న సమాచారం ఉంది. ఈ సినిమాలో పల్లెటూరి అమ్మాయి పాత్రలో నటిస్తూ తన నటనతో మరోసారి మెప్పించనుందన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికి సోషల్ మీడియాలో ఫరియా షేర్ చేసిన తాజా ఫోటోలు అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారాయి. చిట్టి అందానికి కామెంట్ల రూపంలో ప్రశంసల వర్షం కురుస్తుండగా ఆమె తదుపరి సినిమాలపై ఆసక్తి మరింత పెరుగుతోంది.

# నానికి జోడీగా బుట్టబొమ్మ..


**వేద న్యూస్ డెస్క్:**



తెలుగు సినీ పరిశ్రమలో మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధమవుతోంది. నేచురల్ స్టార్ నాని, సాహో ఫేం దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో కొత్త సినిమా తెరకెక్కనున్నట్టు సమాచారం. సహజ నటనతో పాటు ప్రయోగాత్మక చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని ఈసారి పూర్తిగా భిన్నమైన స్టైలిష్ యాక్షన్ అవతారంలో కనిపించనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి హీరోయిన్‌గా బుట్టబొమ్మగా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు టాక్ నడుస్తోంది. నాని, పూజా హెగ్డే తొలిసారి జోడీ కట్టనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఫ్రెష్ కాంబినేషన్ కావడంతో పాటు స్టైలిష్ యాక్షన్ కథాంశంతో సినిమా రూపొందనుందని తెలుస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభం కానుండగా, గ్రాండ్ స్థాయిలో నిర్మించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. థియేట్రికల్ రిలీజ్‌ను 2027లో లక్ష్యంగా పెట్టుకున్నారని టాక్. నాని కెరీర్‌లో మరో డిఫరెంట్ ప్రాజెక్ట్‌గా నిలవనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# వెంకటేశ్ త్రివిక్రమ్ కాంబోపై పెరుగుతున్న హైప్

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్‌లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లకు చిరునామాగా నిలిచిన విక్టరీ వెంకటేశ్ ప్రస్తుతం కెరీర్‌లో అత్యుత్తమ దశను ఆస్వాదిస్తున్నారు. వయసు పెరుగుతున్నా ఆయన ఇమేజ్, నటనలో ఎలాంటి తగ్గుదల లేకుండా వరుసగా ప్రేక్షకులను అలరిస్తుండటం విశేషం. థియేటర్లతో పాటు ఓటిటి వేదికల్లోనూ ఆయన చిత్రాలు మంచి స్పందన అందుకోవడంతో వెంకటేశ్ మార్కెట్ మరింత బలపడింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో ఆయనకు ఉన్న ఆదరణ రోజురోజుకు పెరుగుతుండటంతో నిర్మాతలు కూడా ఆయనతో సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న క్రేజీ కలయిక ఇప్పుడు నిజమవుతోంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం ఆదర్శ కుటుంబం ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు కథ రచయితగా వెంకటేశ్‌తో కలిసి పనిచేసిన త్రివిక్రమ్ ఇప్పుడు దర్శకుడిగా మొదటిసారి ఆయనతో జతకట్టడం సినిమాపై భారీ అంచనాలు పెంచింది. ఇటీవల విడుదలైన టైటిల్ ప్రకటన, ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి. అయితే షూటింగ్ ప్రారంభమైన తర్వాత కొన్ని సాంకేతిక మార్పులు చోటుచేసుకున్నట్లు ఫిల్మ్‌నగర్ వర్గాలు చెబుతున్నాయి. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదన్న ఉద్దేశంతో త్రివిక్రమ్ సాంకేతిక బృందంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సమాచారం. సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డైరెక్షన్ విభాగాల్లో మార్పులు జరిగినట్టు టాక్ నడుస్తోంది. ముందుగా రూపొందించిన భారీ సెట్‌పై పూర్తిగా సంతృప్తి చెందక దాన్ని తిరిగి డిజైన్ చేయించినట్లు వినిపిస్తోంది. ఈ మార్పుల కారణంగా షూటింగ్ షెడ్యూల్‌లో కొంత ఆలస్యం జరిగినప్పటికీ, క్వాలిటీ విషయంలో మాత్రం మేకర్స్ ఎలాంటి రాజీ లేకుండా ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే వేసవిలో సినిమాను విడుదల చేయాలని ఇప్పటికే నిర్మాణ సంస్థ ప్రకటించగా, ఆ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని బృందం పక్కా ప్రణాళికలతో పని చేస్తున్నట్లు సమాచారం. భారీ సెట్ తిరిగి నిర్మాణం షూటింగ్‌పై ప్రభావం చూపుతుందా అన్న సందేహాలు ఉన్నా, విడుదల విషయంలో నిర్మాతలు పూర్తి నమ్మకంతో ఉన్నారని టాక్. ఈ చిత్రంలో హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర కథలో ప్రత్యేకమైన మలుపుగా ఉండబోతుందని ప్రచారం జరుగుతోంది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్ రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు తోడు క్రైమ్ అంశాల మేళవింపుతో ఆదర్శ కుటుంబం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

# ఇది కేవలం క్రికెట్ కాదు.. రూ.4500 కోట్ల వ్యాపారం..

## - భారత్‌పాక్ మ్యాచ్‌పై సర్వత్ర ఉత్కంఠ!



**వేద న్యూస్ డెస్క్:**

టీట్వెంటీ ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ ఇప్పుడు కేవలం క్రీడా పోరాటంగా కాకుండా భారీ ఆర్థిక అంశంగా మారింది. ఈ ఒక్క మ్యాచ్ విలువ సుమారు రూ.4500 కోట్లుగా అంచనా వేయబడుతోంది. ప్రసార హక్కులు, ప్రకటనలు, స్పాన్సర్‌షిప్, టికెట్ అమ్మకాలు, ఇతర వాణిజ్య కార్యకలాపాలు కలిపి ఈ స్థాయి వ్యాపారం జరుగుతుందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఈ మ్యాచ్‌ను టోర్నమెంట్‌కు వెన్నుదన్నుగా భావిస్తారు. పాకిస్థాన్ భారత్‌తో మ్యాచ్ ఆడబోమని వెనుకడుగు వేయడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి తీవ్రంగా స్పందించింది. ఇది రాజకీయ అంశం కాదని, భారీ ఆర్థిక నష్టాలకు దారి తీసే నిర్ణయమని హెచ్చరించింది. ఒకవేళ ఈ మ్యాచ్ రద్దయితే ప్రసార సంస్థలకు ఒక్క మ్యాచ్ ద్వారానే రూ.300 కోట్లకు పైగా ప్రకటనల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రసార సంస్థలు ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ మ్యాచ్ రద్దు ప్రభావం కేవలం ప్రసారకర్తలకే కాకుండా క్రికెట్ బోర్డులపై కూడా పడనుంది. అంచనాల ప్రకారం భారత్, పాకిస్థాన్ బోర్డులకు చెరో రూ.200 కోట్ల మేర ప్రత్యక్ష, పరోక్ష నష్టం వాటిల్లే అవకాశం ఉంది. భారత్ ఈ నష్టాన్ని భరించగలిగినా, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు మాత్రం ఇది తీవ్ర దెబ్బగా మారుతుందని విశ్లేషకులు అంటున్నారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆదాయంలో పాకిస్థాన్‌కు ఏడాదికి గణనీయమైన వాటా లభిస్తోంది. నిబంధనలను ఉల్లంఘించి స్వచ్ఛందంగా మ్యాచ్‌కు దూరమైతే ఆ నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉంది. అంతేకాదు జరిమానాలు, చట్టపరమైన సమస్యలు, భవిష్యత్తులో టోర్నమెంట్ల నిర్వహణ అవకాశాలు కోల్పోయే పరిస్థితి కూడా తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు. ఆర్థిక నష్టాల కంటే పెద్ద సమస్య ప్రతిష్ఠకు భంగం కలగడమేనని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకసారి పాకిస్థాన్ మ్యాచ్‌లు ప్రమాదకరంగా భావించబడితే భవిష్యత్తులో ప్రసార హక్కుల విలువ తగ్గడం, స్పాన్సర్లు వెనక్కి తగ్గడం తప్పదని అంటున్నారు. ఈ ఒక్క నిర్ణయం పాకిస్థాన్ క్రికెట్ భవిష్యత్తుపై దీర్ఘకాల ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# చరిత్ర సృష్టించిన బాబర్ ఆజాం




**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ ముంగిట పాకిస్థాన్ జట్టు ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు ప్రత్యర్థిని 111 పరుగుల తేడాతో ఓడించి ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా జట్టు పూర్తిగా విఫలమై 16.5 ఓవర్లలో 96 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజాం అజేయ అర్ధశతకంతో మెరిశాడు. ఈ ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక అర్ధశతకాలు చేసిన తొలి ఆటగాడిగా బాబర్ ఆజాం చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డును బద్దలు కొట్టాడు. ఇప్పటివరకు బాబర్ ఆజాం 132 ఇన్నింగ్స్‌ల్లో 39 అర్ధశతకాలు సాధించాడు. విరాట్ కోహ్లీ 117 ఇన్నింగ్స్‌ల్లో 38 అర్ధశతకాలతో రెండో స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ 151 ఇన్నింగ్స్‌ల్లో 32 అర్ధశతకాలు చేయగా, మహ్మద్ రిజ్వాన్ 93 ఇన్నింగ్స్‌ల్లో 30 అర్ధశతకాలు, డేవిడ్ వార్నర్ 110 ఇన్నింగ్స్‌ల్లో 28 అర్ధశతకాలు సాధించారు. టీ20 ప్రపంచకప్‌కు ముందు ఈ రికార్డుతో బాబర్ ఆజాం జోరు కొనసాగుతుండటంతో పాకిస్థాన్ జట్టుపై అంచనాలు భారీగా పెరిగాయి.

# టీ20 ప్రపంచకప్ హిస్టరీలో తోపు ప్లేయర్లు వీళ్లే భయ్యో..

**వేద న్యూస్ డెస్క్:**



టీ20 ప్రపంచకప్ అంటేనే పరుగుల వర్షం. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కొని నిలకడగా పరుగులు చేయడం అంత ఈజీ కాదు. 2007లో ప్రారంభమైన ఈ మెగా టోర్నీలో ఎంతోమంది దిగ్గజ ఆటగాళ్లు తమ సత్తా చాటారు. ఫిబ్రవరి 2026 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన టాప్ 5 ఆటగాళ్లు వీరే. ఈ జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఉండటం విశేషం. అగ్రస్థానంలో విరాట్ కోహ్లీ నిలిచాడు. అతడు టీ20 ప్రపంచకప్‌ల్లో మొత్తం 1292 పరుగులు చేశాడు. అద్భుతమైన స్థిరత్వం, క్లాసిక్ బ్యాటింగ్‌తో టీ20ల్లో కూడా విజయం సాధించవచ్చని నిరూపించిన ఆటగాడు జయవర్ధనే. నాలుగో స్థానాన్ని ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ దక్కించుకున్నాడు. 1013 పరుగులతో టాప్ 5లో నిలిచిన అతడు, ఈ జాబితాలో ఉన్న యాక్టివ్ ఆటగాడిగా కొనసాగుతున్నాడు. దూకుడైన ఆటతో ప్రత్యర్థులకు ఎప్పుడూ ముప్పుగా మారే ఆటగాడు బట్లర్. ఐదో స్థానంలో ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు. అతడు 984 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా తొలి టీ20 ప్రపంచకప్ విజయంలో వార్నర్ కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా టీ20 ప్రపంచకప్ చరిత్రలో టాప్ 5 పరుగుల వీరుల జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఉండటం దేశ అభిమానులకు గర్వకారణంగా మారింది. రాబోయే ప్రపంచకప్‌లో ఈ రికార్డులు మరింత మారుతాయా అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073